

14న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు

కాజులూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫీడర్స్ పరిధిలోని లైన్లలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు మరమ్మతు పనులు చేపడుతున్నందని ఈ నెల 24న విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని విద్యుత్ శాఖ కాకినాడ ఇఇ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన ఆర్యవటం సబ్ స్టేషన్ వద్ద పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం 24వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, ఒంటితాడి గ్రామాలతోపాటు, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని, కావున కలుగుతున్న అసౌకర్యానికి వినియోగదారులు సంస్థకు సహకరించాలని కోరారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం

- నిబంధనలు పాటించని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు
- ఎక్కువ మోతాదులో రంగుల వాడకం
- నాసిరకం నూనెలతోనే ఆహార పదార్థాలు తయారీ
- లైసెన్సులు లేకుండానే యథేచ్ఛగా వ్యాపారాలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఆహార పదార్థాలను విక్రయించే పలు దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. రెండుసార్లు కంటే ఎక్కువ దఫాలు ఆయిల్, మోతాదుకు మించి రంగులు, వివిధ రసాయనాలు వాడకంతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నాయి. జాతీయ ఆహార భద్రత ప్రమాణాలకు విరుద్ధంగా ఆహార పదార్థాల అమ్మకాలు, వినియోగం ఎక్కువగా జరుగుతోంది. ఆహార కల్తీ నియంత్రణ అధికారి నుంచి ఎటువంటి లైసెన్సులు లేకుండానే విచ్చలవిడిగా వ్యాపారాలు సాగిస్తున్నాయి.

ఆహార పదార్థాల్లో కల్తీలను నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006ను తీసుకొచ్చి అమలు చేస్తోంది. ఇది 2012 ఆగస్టు 5 నుంచి అమల్లోకి వచ్చింది. అయితే వంట నూనెలు, ఆహార పదార్థాల అమ్మకాలపై ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు చేస్తున్నా అమ్మకం దారులు పట్టించుకోవడం లేదు. లాభార్జనే ధ్యేయంగా వ్యాపారాలను సాగిస్తున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు రుచి, రంగు కోసం అనేక రసాయనాలు, పౌడర్లు వినియోగిస్తున్నారు. నిషేధిత రసాయన పదార్థాలను తినే ఆహార పదార్థాల్లో విచ్చలవిడిగా వాడుతున్నా సంబంధిత అధికారులు అంతగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాకినాడ జిల్లాలో హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ కేంద్రాలు, బేకరీలు, ఆయిల్ ఉత్పత్తి చేసే సెంటర్లు తదితర వాటిల్లో ఆహార కల్తీ నియంత్రణ అధికారులు ఈ ఏడాది ఇప్పటి వరకు 176 శాంపిల్స్ సేకరించగా 23 కేసులను నమోదు చేశారు. గతంలో నమోదు చేసిన 32 కేసుల్లో ఈ నెలలో జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ చేపట్టగా ఆయా యజమానులకు రూ.2.33 లక్షలు జరిమానా విధించారు.



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్ ఫోటో)

ఇష్టారాజ్యంగా కల్తీ నూనెలు వినియోగం

పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, దాబాలు, రెస్టారెంట్లు, బజ్జీల దుకాణాలు, గోబీ సెంటర్లు ఇలా అనేక చోట్ల కల్తీ నూనెలు ఎక్కువగా వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మల్టీసోర్స్ విజిబుల్ ఆయిల్స్ (ఎంఎస్‌విఓ) ఆగ్ మార్క్ నిబంధనల ప్రకారం నిర్దేశించిన పరిమాణంలో మాత్రమే నూనెలు కలపాల్సి ఉంది. అయితే ఇవేమీ పట్టించుకోని వ్యాపారులు ఇష్టారాజ్యంగా కల్తీ నూనెలు వినియోగిస్తున్నారు. రెండు మూడు సార్లు కంటే ఎక్కువగా వాడిన నూనెనే మళ్లీమళ్లీ ఆహార పదార్థాల తయారీకి ఉపయోగిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అంతేకాకుండా ఆరోగ్యాలను పూర్తిగా హరించే టెస్టింగ్ సాల్ట్ ఎక్కువగా వాడుతున్నారు. కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను అధికంగా వినియోగిస్తున్నారు. ప్రధానంగా బేకరీల్లో వాడుతున్న రసాయనాల వలన చిన్నపిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. మరోవైపు పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లలో ఆకర్షణీయమైన రంగులను వినియోగిస్తున్నారు. చికెన్, మాంసాలను రోజుల తరబడి నిల్వ ఉంచేందుకు వాటికి కలర్ కోటింగ్ ఇచ్చి వివిధ రసాయనాలను ఉపయోగిస్తున్నారు. కొన్ని రకాల రసాయనాలను ప్రభుత్వం నిషేధించిన పదేపదే అవే వాడుతున్నారు. దాబాల్లో సైతం ఆహార పదార్థాలు రుచికోసం వినియోగిస్తున్న రసాయనాల వలన ప్రజలు అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో దాదాపు పదివేల పైనే వివిధ ఆహార పదార్థాలను విక్రయించే దుకాణాలు ఉండగా 2188 మాత్రమే లైసెన్సులు తీసుకుని నిర్వహిస్తున్నారు. రూ.కోట్లలో వ్యాపారాలు సాగిస్తున్న పలువురు వ్యాపారులు లైసెన్సులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

సిబ్బంది కొరత

ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి కల్తీ ఆహార పదార్థాలను నియంత్రించాల్సిన అధికారులు అరకొర చర్యలకే పరిమితమవుతున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకపోవడం కూడా ఒక కారణంగా కనిపిస్తుంది. ఉమ్మడి జిల్లాకు ఆహార కల్తీ నియంత్రణ అధికారి ఒక్కరే ఉన్నారు. ఒక్కో జిల్లాకు ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కొక్కరే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆహార పదార్థాలను విక్రయించే వారు యథేచ్ఛగా నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నా అంతగా చర్యలు ఉండడం లేదు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జాతీయ ఆహార భద్రత ప్రమాణాలకు విరుద్ధంగా ఆహార పదార్థాలు అమ్మకాలు, వినియోగం జరిపితే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులు వస్తున్న క్రమంలో ఆయా హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఇతర ఆహార పదార్థాలను వినియోగించే దుకాణాలపై తనిఖీలు చేస్తున్నాం. ఫిర్యాదులు అందుతున్న క్రమంలో శాంపిల్స్ సేకరించి నిబంధనలకు విరుద్ధంగా ఆయిల్, రసాయనాలు వాడుతున్న వారిపై చర్యలకు దిగుతున్నాం. సిబ్బంది కొరత వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నాయి.

-బి.శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులు

మహిళా కార్మికులకు వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో మహిళా కార్మికులు పనిచేసే అన్ని పారిశ్రామిక యూనిట్లలో వాష్ రూములు, చైల్డ్ ఫీడింగ్, చైల్డ్‌కేర్ రూములను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కోర్టు హాల్లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముందుగా సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల ద్వారా అనుమతుల కోరుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన ధరఖాస్తుల పరిష్కార ప్రగతిని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడచిన త్రైమాస కాలంలో జిల్లాలో వివిధ అనుమతుల కొరకు మొత్తం 221 ధరఖాస్తులు రాగా, వీటిలో 188 ధరఖాస్తులను పరిష్కరించారని, 8 ధరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. మహిళలు పని చేస్తున్న పరిశ్రమల్లో వాష్ రూములు, చైల్డ్ ఫీడింగ్, చైల్డ్ కేర్ రూములు తప్పనిగా ఉండాలన్నారు. అలాగే మహిళా కార్మికుల పట్ల అనుచిత పోకడల నివారణకు అన్ని యూనిట్లలో ప్రత్యేక రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం టి.మురళి, ఏడీ కె.కృష్ణారావు, ఎల్‌డిఎం సిహెచ్ ఎస్‌వి.ప్రసాద్, డిపిఒ కె.భారతి సౌజన్య, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాళ్లరేవు



సమావేశంలో మాట్లాడుతున్న శేషబాబ్జి

ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను కార్మికులంతా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి శేషు బాబ్జి పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి. ఈశ్వరరావు ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు పండించే అన్ని పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించి 200 రోజులు పని దినాలు, రూ. 600లు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలపై దాడి చేస్తూ అన్ని రకాల వస్తువులు ధరలు పెంచుతుందన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే మహాధర్నాకు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు విజయవాడ రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వళ్ల రాజబాబు, చంద్రమల్ల పద్మ, చల్లా సంతోష్ కుమార్, మందనక్క తణుకు రాజు, దడాలబ్బులు, పాలెపు ఈశ్వరరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి నాగమణి

హాజరుశాతాన్ని పెంచాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు తగినట్లుగా విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి ఆదేశించారు. నామన వెంకాయమ్మ జడ్‌పి ఉన్నత పాఠశాలలో అటల్ మార్తాండ్ సక్సెస్ మీట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్‌జెడి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులచే దేశవ్యాప్తంగా నిర్వహించిన వినూత్న ప్రయోగాల నేపథ్యంలో తాళ్లరేవు హైస్కూల్ టాప్ 400 పాఠశాలల్లో ఒకటి కావడం విశేషం అన్నారు. రాబోయే రోజుల్లో తాళ్లరేవు హైస్కూల్ విద్యార్థులు విభిన్నమైన ప్రాజెక్టులు చేసి జాతీయస్థాయిలో అత్యున్నత స్థానానికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతీ ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలన్నారు. . ఈ ప్రాజెక్టులో ఉత్తమ ప్రతిభ కనబరచిన తాళ్లరేవు హైస్కూల్ విద్యార్థులు దంగేటి నవ్య శ్రీ, కురిపూడి జోత్స్న, అప్పల్ల హేమ, గైడ్ టీచర్ పి.కిషోర్, ధవళేశ్వరం ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.ప్రవల్లిక, డి.దీపికలను అభినందించారు. హైస్కూల్లోని అటల్ ల్యాబ్‌ను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆశాలత, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస వినీల్, డెల్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు హేమంత్,రామ్, ఎల్ఎల్‌ఎం ఫౌండేషన్ బి.అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం వైసిపిని గెలిపించండి

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని పరిరక్షించేందుకు రాబోయే ఎన్నికల్లో వైసిపిని మరోసారి గెలిపించాలని హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. మండలంలోని కట్టమూరు గ్రామంలోని 1, 2 సచివాలయాల పరిధిలో వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గత నాలుగున్నరేళ్ల పాలనలో సిఎం జగన్ ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిరియాల రాజా, సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, ఎంపిటిసి సభ్యులు నల్లల సూర్యకుమారి, ఉప్పటి ప్రసాద్, పిఎసిఎస్ ఛైర్మన్ చల్లా చినవీర్రాజు, జోడు గుడులు దేవస్థానం ఛైర్మన్ మేడిద వెంకట రామారావు, గోపు మురళి, వినుకొండ వీర విష్ణుచక్రం, తదితరులు పాల్గొన్నారు

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్



ఆటోడ్రైవర్‌కు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

విద్యార్థులను ఆటోల్లో పాఠశాలలకు తీసుకెళ్లే సమయంలో సంబంధిత ఆటో డ్రైవర్ విద్యార్థుల క్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు సూచించారు. విశాఖపట్నంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదానికి గురియై పలువురు విద్యార్థులు గాయపడిన నేపథ్యంలో బుధవారం పట్టణంలోని మూడు ఆటో స్టాండుల వద్ద, మెహర్ కాంప్లెక్స్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు చిన్నపిల్లల విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ వేగాన్ని నిరోధిస్తూ క్షేమంగా విద్యార్థులను పాఠశాలకు, తిరిగి వారి గృహాలకు చేర్చాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకున్న ఎవరిని ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మూర్తి, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ రామకృష్ణ పాల్గొన్నారు.

'మచ్చలేని నాయకుడు చంద్రబాబు'

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



స్వీట్లు పంపిణీ చేస్తున్న నులుకుర్తి

టిడిపి అధినేత చంద్రబాబు మచ్చలేని నాయకుడని మాజీ జడ్‌పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు స్కిల్ డవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన మండలంలోని ఇంద్రపాలెంలో బుధవారం కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నురుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు ఈ నెల 28న జైలుకు వెళ్ళాల్సిన అవసరం లేదని, 30న ఎసిబి కోర్టుకు వెళితే సరిపోతుందని అన్నారు. యువతకు బరోసా ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన స్కిల్ డవలంప్‌మెంట్ కార్పోరేషన్ కేసులో ఒక్క పైసా కూడా అవినీతికి ఆస్కారం లేదన్నారు. యువతకు ఉపాది అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చంద్రబాబు పని చేశారన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో యువతకు ఉపాధి కరువయ్యిందని విమర్శంచారు. ప్రజలకు మంచి చేసే నాయకులను వైసిపి ప్రభుత్వం అన్యాయంగా కేసులు బనాయించడం పరిపాటిగా మారిందన్నారు. చంద్రబాబు ఈ కేసుల నుంచి మచ్చలేని నాయకుడిగా బయటపడి వచ్చే ఎన్నికల్లో అఖండ విజయంతో సిఎం అవుతారని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండా వినాయక్, దమ్ము నూకరాజు, వాసంశెట్టి నిరీక్షణ్, కోణాల కృష్ణ, పితాని శ్రీను, గుబ్బల శివ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘం అధ్యక్షునిగా రాజాగణేష్

ప్రజాశక్తి - ఏలేశ్వరం



గణేష్‌ను అభినందిస్తున్న సంఘీయులు

ఏలేశ్వరం ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ సంఘం అధ్యక్షునిగా సిద్ధాంతపు రాజా గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎఫ్‌డిఒ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో రాజా గణేష్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలపై పోరాడతామన్నారు. కార్యదర్శిగా పాండ్రంకి సత్తియ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పెద్దలు పి.చిన్న రామారావు, ఎ.రామారావు, పి.పెద్ద వెంకటరమణ పాల్గొన్నారు.

ఎంపిటిసి కుటుంబానికి వరుపుల పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యురాలు ఈజపు సూర్య కళ కుటుంబాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ బుధవారం పరామర్శించారు. ఇటీవల కాలంలో ఎంపిటిసి సూర్యకళ మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పారిపాకలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు, టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు సాంబశివరావు, కోసూరి కృష్ణ వర్మ, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి తగిన గుర్తింపు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

టిడిపిలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు. అమలాపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకులుగా నియమితులైన ముదునూరి మురళీకృష్ణంరాజును బుధవారం ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపిలో క్రమశిక్షణ కల్గిన నాయకులు, కార్యకర్తలకు మంచి గుర్తింపును ఇస్తుందని, ఇటీవల కాలంలో ప్రత్తిపాడుకు చెందిన మురళీకృష్ణంరాజును అమలాపురం నియోజకవర్గ పరిశీలకులుగా పార్టీ అధిష్టానం నియమించి మంచి గుర్తింపును ఇచ్చిందని అన్నారు. ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

నేడు ప్రత్తిపాడులో సాధికార యాత్ర

ప్రజాశక్తి - ఏలేశ్వరం

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో గురువారం సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభ నిర్వహించినట్లు ఎంఎల్‌ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడులో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లును ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో బహిరంగ సభలో మంత్రులు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు పాల్గొంటారని తెలిపారు. ఈ సభను వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్, కడింశెట్టి వాసు పాల్గొన్నారు.

వృద్ధులు, విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి



దుప్పట్లు పంపిణీ చేసిన పెద్దిరాజు దంపతులు


మండలంలోని పాత ఇసుకపల్లిలో ఎంపిపి పాఠశాలలో వృద్ధులు, విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కొర్ల వెంకట్రావు, మంగయ్యమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ పెద్దిరాజు మాట్లాడుతూ ప్రతీ ఏడాది వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నగదు బహుమతిగా ఇచ్చేవారమని, అయితే ఈ ఏడాది వృద్ధులు, విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం పెద్దిరాజు, సునీత దంపతుల చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతపల్లి మౌలారెడ్డి, ఎరకం సుబ్బిరెడ్డి, కడిమిశెట్టి అబ్బిరెడ్డి, పెనుమల్లు వీర వెంకట సుబ్బిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం


బాలికలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలని సిడిపిఒ జి.ఉష, సూపర్‌వైజర్ సిహెచ్.వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక వీర్రాజు హైస్కూల్లో బుధవారం భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వారు మాట్లాడుతూ బాలికలను ఉన్నతంగా చదివించేందుకు శ్రద్ధ చూపాలని, అన్ని రంగాల్లోనూ వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, బాల్య వివాహ నిరోధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థిణులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



బుచ్చి సీతయ్యమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం



వృద్ధులుకు వస్త్రదానం చేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

స్థానిక మహారాణి సత్రం వ్యవస్థాపకురాలు, రాజా వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ మహారాణి 188 వ వర్ధంతిని బుధవారం మహారాణి సత్రంలో ఘనంగా నిర్వహించారు. సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ 1882లో మహారాణి స్థాపించిన ఈ సత్రంలో రాజేసిన పొయ్యి ఈనాటికి ఆరకుండా అన్నదానం నిర్వహించబడటం చిన్న విషయం కాదన్నారు. ఈ సత్రం అన్నదానంలోనే కాకుండా విద్యాదానంలో కూడా రాష్ట్రంలోనే గుర్తింపు పొందిందన్నారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి లు మాట్లాడుతూ మహారాణి ఆశయ స్ఫూర్తితో ఈ సత్రంను అన్నదానంలో ఉన్నత స్థితిలో నిలపాలన్నారు. అనంతరం పేదలకు వస్త్ర దానం, అన్నదానం నిర్వహించారు. ఈ సభా కార్యక్రమానికి ముందు సత్రం ఆవరణలోని మహారాణి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబు, కౌన్సిలర్లు బి.వీర వెంకట దుర్గా, సత్య భాస్కరరావు, ఎ.వీరరాఘవ, వి.రాజా, కోఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ, టిడిపి నాయకులు తూతిక రాజు, రంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పాలనలో ఎన్ని రోడ్లు వేశారు..?



సమావేశంలో మాట్లాడుతున్న రఘురాం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

టిడిపి ప్రభుత్వ పాలనలో జగ్గంపేట నియోజకవర్గంలో ఎన్ని రోడ్డు వేశారని జిల్లా జెసిఎస్ కో-ఆర్డినేటర్ ఒమ్మి రఘురాం ప్రశ్నించారు. స్థానిక సచివాలయం-1లో బుధవారం వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ టిడిపి పాలనలో రోడ్లు వేయకుండా జగన్ ప్రభుత్వంపై నెట్టడం వల్లే ప్రస్తుత పరిస్థితికి కారణమన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ జ్యోతుల నెహ్రూ గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపి పాలనలో వేసిన రోడ్లు రెండేళ్లకే గుంతలు పడ్డాయా? అని ప్రశ్నించారు. వీటికి టిడిపి నాయకులే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొలుత సచివాలయం వద్ద పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఒమ్మి బిందు మాధవి, ఎంపిడిఒ వసంత్ కుమార్, ఎంపిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

బావమరిదిపై దాడి చేసిన బావపై కేసు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

తన అక్క కాపురం విషయంలో పెద్దల సమక్షంలో మాట్లాడుతుండగా ఆగ్రహంతో కర్రతో బావమరిదిపై దాడికి దిగిన బావపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బివై.కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు పేరవరం గ్రామానికి చెందిన కోట వీరబాబుకి, తాడేపల్లిగూడెంకు చెందిన ఎలిసెంటి నరసన్నకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఈనెల 21న పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. పెద్దలు మాట్లాడుతుండగా నరసన్న దురుసుగా ప్రవర్తించి తన బావమరిది వెంకటేశ్వరరావును కర్రతో కొట్టి గాయపరిచాడు. దుర్భాషలాడుతూ పెద్దలను సైతం బెదిరించాడు. గాయపడిన వెంకటేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి కోసం గాలింపు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

అదృశ్యమైన ర్యాలి గ్రామానికి చెందిన వనచర్ల చిన్నబూరయ్య ఆచూకీ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 16న సాయంత్రం బహిర్భూమికి వెళ్లి బూరయ్య తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆయన భార్య జవ్వాలమ్మ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు ఎస్ఐ బివై.కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఎక్కడికైనా వెళ్లాడా, లేదా ప్రమాదవశాత్తూ గోదావరిలో పడిపోయాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ర్యాలీ పరిసర ప్రాంతాల్లో, గోదావరి కాలువల వెంబడి గాలింపు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారి తూర్పుగానుగూడెంలో వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గండేపల్లికి చెందిన దంపుపడాల శ్రీను జిఎస్ఎల్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కుమార్తెకు బైకుపై మంగళవారం రాత్రి భోజనం తీసుకెళ్తున్నాడు. ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వెళ్తున్న బల్ల రిక్షాను వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అతన్ని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. రిక్షా కార్మికుడు గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

రైతులకు ఇచ్చే రుణ పరిమితుల ప్రతిపాదన

ప్రజాశక్తి - కాకినాడ

పెట్టుబడి, ఉత్పాదక వ్యయం, ఇన్‌పుట్ ధరల పెరుగుదల వంటి అంశాల ఆధారంగా 2024-25 సంవత్సరానికి జిల్లాలో వివిధ వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు అందించే రుణ పరిమితులను జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ ప్రతిపాదించింది. బుధవారం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పాడి, మత్స్య కార్యకలాపాలు చేపట్టే రైతులకు ఉత్పాదక వ్యయం, రాబడుల ఆధారంగా బ్యాంకుల ద్వారా అందించగల రుణ పరిమితులను ఆయా శాఖల జిల్లా అధికారులు కమిటీకి వివరించారు. ఉత్పాదక వ్యయంలో కనీసం 60 శాతం పంట కాలిక రుణాలుగా అందించేందుకు ఆయా అంశాల కింద స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితులను కమిటీ నిర్ణయించింది. ఎకరాకు ప్రధాన పంట వరికి రూ.38 వేల నుంచి రూ.45 వేలు, మొక్కజొన్నకు రూ.28 వేల నుంచి రూ.42 వేలు, మిరపకు రూ.68 వేల నుంచి రూ.75 వేలు, పత్తికి రూ.40 నుంచి రూ.60 వేలు, అరటి రూ.75 వేల నుంచి రూ.85 వేలు, మామిడికి రూ.40 నుంచి రూ.45 వేలు, బొప్పాయికి రూ.72 నుంచి రూ.75 వేలు, ఆయిల్ పామ్‌కు రూ.65 వేలు, కురగాయ పంటలకు రూ.16 వేల నుంచి రూ.40 వేలు, ఉల్లికి రూ.45 వేల నుంచి రూ.51 వేలుగా రుణపరిమితి కమిటీ నిర్ణయించింది. అలాగే మల్బరీ, పట్టుపురుగుకు రూ.85 వేల నుంచి రూ.95 వేలు, రొయ్యల సాగుకు రూ.5 లక్షల నుంచి రూ.5.50 లక్షలుగా నిర్ణయించింది. కమిటీ నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితుల ప్రతిపాదనలను రాష్ట్ర కమిటీ ఆమోదానికి పంపాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిసిబి సిఇఒ ఆర్‌వి.నరసింహ రావు, ఎల్‌డిఎం సిహెచ్‌ఎస్‌వి ప్రసాద్, నాబార్డ్ ఎజిఎం డాక్టర్ వై.సోమునాయుడు, వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ జెడి ఎస్.సూర్యప్రకాశరావు, మత్స్య శాఖ జెడి పి.సత్యనారాయణ, పెద్దాపురం హార్టికల్చర్ అధికారిణి కె.సత్యశైలజ, ఎస్‌బిఐ డిప్యూటీ రీజనల్ హెడ్.నారాయణ, సిజిజిబి బిఎం బి.చంద్రశేఖర్, ఇతర బ్యాంకుల అధికారులు, డిసిసిబి అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

యానాం వార్తలు

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో హెచ్ఐవి - ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సరెళ్ల వీరకుమార్, ఒటిలి దుర్గామహలక్ష్మి హెచ్ఐవి, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎయిడ్స్ బారిన పడిన వారు తీసుకోవాల్సిన చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుందర్, జిల్లా యువజన అధికారి టి.గోపి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


దగ్ధమైన బోటును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి

దగ్ధమైన బోటు పరిశీలన

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు సావిత్రి నగర్ గ్రామానికి చెందిన కామాడి భైరవ స్వామి బోటును ఈ నెల 15 అర్ధరాత్రి గోదావరి ఒడ్డున గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేశారు. దీన్ని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్ఎఒ మునిస్వామి పరిశీలించారు. ఘటన జరిగి వారమైనా ఎందుకు చర్యలు తీసుకోలేదని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడు కామాడి భైరవస్వామి కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితుడికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారనాయకులు, పెద్దలు, యువకులు, ఎస్‌పి రఘునాయగం, ఎస్ఐ నూకరాజు పాల్గొన్నారు.

నాణ్యతను మెరుగుపర్చేందుకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రీయ ఉచ్చాతర్ శిక్షా అభియాన్ (రూసా)లో భాగంగా బోధన, అభ్యసనా ప్రక్రియల నాణ్యతను మెరుగుపర్చేందుకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా.భాస్కర్ తెలిపారు. జెఎన్‌టియుకె చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. విశ్వవిద్యాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు, చీఫ్ ఇంజనీర్, రూసా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్‌తో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం వసతి గృహాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యక్రమాలు చేపట్టడం, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు, బోధనా, అభ్యసనా పద్ధతులను మరింత బలోపేతం చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలో రూసా నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేస్తామని ఉపకులపతి ప్రసాదరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో రూసా కో-ఆర్డినేటర్ మరియు ఉమెన్ ఎంపవర్మెంట్, గ్రీవెన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.స్వరూపారాణి, చీఫ్ ఇంజనీర్ ప్రొఫెసర్ వి.శ్రీనివాసులు, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం.కృష్ణప్రసాద్, చీఫ్ ఇంజనీర్ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న భాస్కర్

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

ప్రజాశక్తి - కరప

సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు లబ్ది పొందుతున్నారని జడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి పి.శ్రీలక్ష్మీ సత్తిబాబు అన్నారు. మండలంలోని పాతర్లగడ్డ గ్రామంలో సర్పంచ్ ఏసుబాబు అధ్యక్షతన ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం బుధవారం ఇఒపిఆర్‌డి ఎస్‌వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శి బి.చంద్రకళ పి.సుధాకర్ నిర్వాహణలో జరిగింది. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని సిఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చింతా ఈశ్వరరావు, ఉప సర్పంచ్ పులుగు నారాయణ మూర్తి పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కాజులూరు

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి అధ్యక్షులు గుబ్బల యేసు రాజు అన్నారు. బుధవారం మండల మండలంలోని మంజేరు గ్రామంలో గుంటూరు అప్పారావు ఆధ్వర్యంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో యేసు రాజు పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం జగన్ పని చేస్తున్నారని అన్నారు. గతంలో ఏ సిఎం చేయని విధంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వనుము వెంకటసుబ్బారావు, ఎంపిపి మాత భారతి మురళి, మంజేరు, గొల్లపాలెం, తణుకువాడ సహకార సంఘ అధ్యక్షులు గండి కిషోర్, సత్తి శ్రీరామారెడ్డి, పితాని సుబ్రమణ్యం, కాజులూరు ఉపసర్పంచ్ దండంకి చిన్నారావు ఎంపిటిసి దడాల రమేష్, సర్పంచులు నెల్లి బ్రహ్మాజీ, నరాల సుబ్బరాజు, మాజీ సర్పంచ్ పోతురాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 6 డివిజన్ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంతంగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల సొమ్మును జమ చేస్తోన్న ఏకైక సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఇటువంటి సిఎంను మరోసారి గెలిపించుకుంటే పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, స్థానిక నాయకులు తెలుగు రామకృష్ణ, జార్జి, సారధి, అంజిబాబు, రెడ్డి, నందకుమార్, తొంపల తాతారావు, సిగల మధు, బత్తిన రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్‌వాడీ కార్యకర్తలకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 8 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధపడుతున్న అంగన్‌వాడీలతో చర్చలు నిర్వహించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు తెలంగాణా కంటే రూ.1000 అదనంగా ఇస్తానని సిఎం హామీ ఇచ్చారని, నాలుగున్నరేళ్ల పాలన పూర్తియినా నేటికీ వారికి ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, కావున సిఎం ఇచ్చిన హామీ మేరకు వారికి జీతాలు పెంచడంతోపాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో వారు చేసే సమ్మెకు ప్రజలంతా సంపూర్ణంగా మద్దతు ఇస్తారని అన్నారు.


లక్షదీపార్చనలో సర్పంచ్ తదితరులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- పెద్దాపురం

స్థానిక శతాబ్ది పార్కు వద్ద గల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా ఈనెల 23వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎపిఎస్‌డిఎస్.ప్రభాకర్ తెలిపారు. పట్టణ పరిధిలోని సత్తిరెడ్డి పేట, దర్గా పేట, భాస్కర్ కాలనీ, బంగారమ్మ గుడి వీధి, వీరయ్యమ్మ పేట, ఆర్‌బి.పట్నం రోడ్డు, నువ్వుల గుంట వీధి, పాత ఆసుపత్రి వీధి, మంగళవారపు పేట, గౌరీ కోనేరు కాలనీ, అంకయ్యపేట, సుబ్బయ్య పేట, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భీమేశ్వరాలయంలో లక్ష దీపార్చాన

ప్రజాశక్తి రామచంద్రపురం

కార్తీక మాసం సందర్భంగా హసన్‌బాదలోని భీమేశ్వరాలయంలో లక్ష దీపార్చన చేశారు. ఈ సందర్భంగా ఉండి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. లక్ష ఒత్తులతో దీపాలు వెలిగించారు. అనంతరం తీర్థం ప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బోడిపాలెం వంతెన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

బోడిపాలెం వంతెన శిథిలావస్థకు చేరింది. అయినప్పటికీ నిత్యం వందలాది లారీలు 40-50 టన్నుల మట్టి లోడ్‌తో దీనిగుండా ప్రయాణిస్తున్నాయం. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కపిలేశ్వరపురం మండలం లంక గ్రామాల సమీపంలో బోడిపాలెం వద్ద బ్రిటిష్ కాలంలో వంతెనను నిర్మించారు. అప్పటి నుంచి ఈ వంతనపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన శిథిలావస్థకు చేరడంతో పలుమార్లు స్థానికులు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మిస్తామని చెప్పడం తప్ప ఈ దిశగా అడుగులు వేసింది లేదు. కేదార్లంక, వీధివారి లంక, నారాయణలంక ప్రజలు ఏ చిన్న పనికి అయినా కొత్తపేట, రావులపాలెం, అమలాపురం వంటి ప్రాంతాలకు వెళ్తుంటారు. ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ వంతెనే ఆధారం. ఈ వంతెన కాస్తా కూలి పోతే ఆయా గ్రామాలకు రాకపోకలు తెగిపోతాయి. అదే జరిగితే తమ పరిస్థితి ఏంటని ఆయా గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే నూతన వంతెన పనులను చేపట్టాలని, అప్పటి వరకూ భారీ వాహనాలను నిలువరించాలని కోరుతున్నారు.

కార్యదర్శి ఏసుబాబుకు ఘన సత్కారం



సేసుబాబును సత్కరిస్తున్న అధికారుల, ఉద్యోగులు

ప్రజాశక్తి - కాకినాడ

గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి పొందిన కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబును కార్పొరేషన్ అధికారులు బుధవారం ఘనంగా సత్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సత్కార సభలో వివిధ విభాగాధిపతులు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ సమర్ధవంతమైన సేవలతో గుమస్తా నుంచి అంచలంచెలుగా గ్రేడ్-1 కమిషనర్‌గా ఉద్యోగ ఉన్నతి పొందిన ఏసుబాబు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ, లీగల్ అడ్వైజర్ డివిఎస్ఎన్ మూర్తి (మురళి) మాట్లాడుతూ క్రింది స్థాయి ఉద్యోగుల నుంచి అధికారుల వరకు అందర్నీ సమన్వయం చేసుకుంటూ ఏసుబాబు చేసిన సేవలే ఆయనను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాయన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృధ్వీచరణ్, ఎసిపి నాగశాస్త్రులు, ఇఇలు వెంకటరావు, మాధవి, ఎఇ శిరీష్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మహేశ్వరరావుకి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడ

ఒంటిమామిడిలో సాంప్రదాయ వైద్యం చేస్తున్న ఉపాధ్యాయుడు కెవికె.మహేశ్వర రావుకి 2022 సంవత్సరానికి పట్టాభి కళా పీఠం జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఎముక విరిగితే పుత్తూరు, పచ్చకామెర్లు వస్తే వెల్ల, గాయం మానకపోతే తొండంగి మండలం ఒంటిమామిడి గ్రామంలో చేసే సాంప్రదాయ వైద్యం చేయించుకోవడానికి వెళుతుంటారు. గాయాలు, దెబ్బలు, తెగిన గాయాలు, కాలిన గాయాలు, షుగర్ పుండ్లు, గ్యాంగ్రీన్, మానవ మొండి పుండ్లు, పాముకాటు గాయాలు, వెరికోజ్ వెయిన్ గాయాలు, సెప్టిక్ గాయాలు తదితర గాయం ఏదైనా తన పూర్వీకులు, గురువుల నుండి నేర్చుకున్న వైద్యం చేస్తూ దానవాయిపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కెవికె మహేశ్వరావు సేవలు అందిస్తున్నారు. వీళ్లు కాళ్లు కట్ చేయకుండా చేస్తున్న ఈ ప్రత్యేక వన సంజీవిని వైద్యానికి 2022 సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో ప్రతి ఏటా ఇస్తున్న పట్టాభి కళా పీఠం జాతీయ పురస్కారానికి మహేశ్వ రరావును ఎంపిక చేశారు. ఈ పురస్కారాన్ని నవంబర్ 24 తేదీన గుంటూరులో ప్రధానం చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు మహేవ్వరరావును అభినందించారు.

మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

గ్రామాల్లో నిషేధిత పదార్థాలైన గంజాయి, నాటు సారా వంటివి తయారు చేసినా, అమ్మినా చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సిఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని నరేంద్రపట్నంలో బుధవారం స్థానిక ఎస్ఐ నాగార్జునరాజు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎవరైనా సారా తయారు చేస్తున్నా, అమ్ముతున్నా, జుదాలను నిర్వహిస్తున్నా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరానలు గోప్యంగా ఉంచుతామన్నారు. వివాహాది శుభకార్యాలకు ఇల్లు విడిచి కుటుంబ సమేతంగా బయట ప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా జగ్గంపేట స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామంలో స్థానికుల నుంచి ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు మొత్తం ఐదుగురితో పీస్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. వీరు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెత్తనం అంతా పురుషులదే...

ఇళ్లకే పరిమితమవుతున్న మహిళా ప్రజాప్రతినిధులు

ప్రశ్నార్థకమవుతున్న మహిళా సాధికారత?

ప్రజాశక్తి-రామచంద్రపురం

మహిళలు వెనకబాటు తనం నుంచి బయటకు రావాలని వారికి స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఇవ్వాలని భారత రాజ్యాంగం 73వ సవరణ ద్వారా మహిళలకు సాధికారత కల్పించారు. 1970లో అమల్లోకి వచ్చిన మహిళా సాధికారత బిల్లు ద్వారా మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. మహిళా సాధికారత అంటే మహిళల శక్తి యుక్తులను బలోపేతం చేయడం, వారి సామర్థ్యాలను మెరుగుపరచడం, సమర్ధులుగా తయారు చేయడం. అందులో భాగంగా వారందరికీ స్థానిక సంస్థలు, శాసనసభల్లోనూ రిజర్వేషన్లు కల్పించి, వారికి పరిపాలన పరమైన లక్షణాలతోపాటు నాయకత్వం వహించే అవకాశం కల్పించారు. అయితే మహిళా ప్రతినిధులు రిజర్వేషన్ల ప్రకారం ఎంపికైనప్పటికీ వారి పదవులను సైతం మగమహారాజులు అనుభవిస్తున్నారు. పంచాయతీల్లోనూ, మండల పరిషత్ సమావేశాల్లో మహిళా సర్పంచులు, మహిళా ఎంపిటిసి సభ్యులు ఉన్న ప్రాంతాల్లో వారి భర్తలు పెత్తనం చెలాయిస్తూ మహిళలకు పరిపాలనపరమైన అవకాశాలు లేకుండా చేస్తున్నారు. రామచంద్రపురం మండలంలో 20 ఎంపిటిసి స్థానాలకు 12 స్థానాల్లో మహిళలు గెలుపొందారు. ఎనిమిది మంది పురుష ఎంపిటిసి సభ్యులున్నారు. 25 మంది సర్పంచులకు 12 మంది పురుషులు కాగా, 13 మంది మహిళా సర్పంచులు ఉన్నారు. ఆయా పంచాయతీల వద్ద గ్రామసభలు, ఇతర సభలకు, మండల పరిషత్ సమావేశాలకు మహిళా ప్రజాప్రతినిధుల స్థానాల్లో వారి భర్తలు హాజరవుతూ పెత్తనం చలాయిస్తున్నారు. పరిపాలనా పరమైన నిర్ణయాలు సైతం వారే తీసుకుంటున్నారు.


మండల పరిషత్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఓ ప్రజాప్రతినిధి భర్త

దీంతో రాజ్యాంగం మహిళలు కల్పించిన మహిళా సాధికారత ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయంగా మహిళలు రాణించాలనే లక్ష్యంగా రాజ్యాంగం పలు అవకాశాలు కల్పించింది. నిబంధన 14 ఒకటి, వివక్ష నిర్మూలించేందుకు నిబంధన15, సమాన అవకాశాలకు నిబంధన 16, గౌరవానికి భంగం కలగకుండా నిబంధన 51ఎ వంటి పలు రక్షణ చట్టాలను ఏర్పాటు చేసింది. ఇవేమీ సక్రమంగా అమలు కావట్లేదు. మహిళలకు కల్పించిన మహిళా సాధికారత సక్రమంగా అమలు చేయాలని మహిళలు రాజకీయ రంగాల్లోనూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భర్తల పెత్తనం తగ్గించాలని కోరుతున్నారు. మండల సమావేశాలు మహిళా ప్రతినిధులు స్వయంగా హాజరయ్యేలా చూడాలని పలువురుకోరుతున్నారు.